కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో...
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :126 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | బుధవారం 02-09-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## కదిలే బస్సులో కీచక పర్వం... కేంద్రం,యూపీ సర్కార్లపై రాహుల్ గాంధీ నిప్పులు

న్యూఢిల్లీ, దేశ రాజధాని ప్రాంతం పరిధిలో మహిళల భద్రత మళ్లీ ప్రశ్నార్థకమైంది. చుట్టూ వేల సంఖ్యలో నిఘా నేత్రాలు, అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో కిలోమీటరుకో చెక్‌పోస్టులు ఉన్నా... నడిరోడ్డుపై రయ్‌మంటూ దూసుకెళ్లే స్లీపర్ బస్సులో ఓ అభాగ్యురాలిపై సాగిన అకృత్యం అధికార యంత్రాంగం నిద్రమత్తును బట్టబయలు చేసింది. ఏకంగా 47 కిలోమీటర్ల మేర రాజధాని రహదారులపై కదిలే బస్సులోనే ఈ రాక్షస కాండ సాగినా ఏ ఒక్క పోలీసు తనిఖీలోనూ పట్టుబడకపోవడం వెనుక ఉన్న వ్యవస్థాగత నిర్లక్ష్యం ఎవరిది? దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తున్న ఈ ఘాతుకంపై విపక్షాలు ఎందుకు భగ్గుమంటున్నాయి? అసలు ఆ రాత్రి ఏం జరిగింది?

వ్యవస్థాగత వైఫల్యంపై రాహుల్ గాంధీ ఆగ్రహ జ్వాల :

గ్రేటర్ నోయిడా నుంచి దిల్లీకి వెళ్తున్న స్లీపర్ బస్సులో మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని పోలీసు విభాగాలకు కనీస జవాబుదారీతనం కొరవడిందని ధ్వజమెత్తారు."బస్సు నోయిడా, గ్రేటర్ నోయిడా ఎక్స్‌ప్రెస్‌వే, దిల్లీ ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా అంతర్రాష్ట్ర సరిహద్దులను దాటింది. కానీ ఏ ఒక్క చెక్‌పోస్టు వద్ద కూడా ఆ బస్సును ఆపి తనిఖీ చేయలేదు. లోపల జరుగుతున్న ఘోరం బయటకు కనిపించకుండా కిటికీలకు తెరలు కప్పేశారు. నిందితులకు చట్టమన్నా, పోలీసులన్నా ఎలాంటి భయమూ లేదు. నిర్భయ ఘటన జరిగి ఇన్నేళ్లయినా బస్సుల పర్యవేక్షణలో వచ్చిన మార్పేమిటి? వ్యవస్థను బాగుచేసేలోపు ఇంకెందరు ఆడబిడ్డలు బలికావాలి?"– రాహుల్ గాంధీ (ఎక్స్ వేదికగా)గతంలో జరిగిన దారుణాల మాదిరిగానే ఈ కేసును కూడా తొక్కిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, దిల్లీ–యూపీ సరిహద్దుల్లో మహిళల రక్షణ గాల్లో దీపంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.సహాయం కోసం ఎదురుచూపు: ఆగస్టు 4 రాత్రి కుటుంబ సభ్యులతో మనస్పర్థల కారణంగా ఓ యువతి ఇంటి నుంచి బయటకు వచ్చింది. నోయిడాలోని బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో, కుండపోత వర్షం కారణంగా మార్గం తెలియక గ్రేటర్ నోయిడాలోని 'పరీ చౌక్' వద్ద బస్సు దిగింది. అర్ధరాత్రి వర్షంలో ఒంటరిగా నిలుచున్న ఆమె, అటుగా వచ్చిన ఒక ఖాళీ స్లీపర్ బస్సును ఆపి లిఫ్ట్ కోరింది.

నమ్మించి నరకంలోకి :

బస్సు డ్రైవర్, కండక్టర్ ఆమెను నోయిడా సెక్టార్ 63 వద్ద దించుతామని నమ్మబలికి బస్సులోకి ఎక్కించుకున్నారు. అయితే బస్సు కదిలిన కాసేపటికే కండక్టర్ సందీప్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు.



అనంతరం డ్రైవర్, కండక్టర్ ఇద్దరూ కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. బాధితురాలు గట్టిగా కేకలు వేస్తూ ప్రతిఘటించగా, చంపేస్తామని తీవ్రంగా బెదిరించారు.

కర్టెన్ల మాటున రాక్షసత్వం:

ఆ స్లీపర్ బస్సు బెర్తులకు పూర్తిస్థాయిలో కర్టెన్లు ఉండటంతో లోపల జరుగుతున్న దారుణం రోడ్డుపై ఉన్నవారికి గానీ, ఇతర వాహనదారులకు గానీ కనిపించలేదు. ఏకంగా 47 కిలోమీటర్ల మేర నోయిడా–దిల్లీ ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా బస్సును నడుపుతూనే ఈ రాక్షస క్రీడ కొనసాగించారు. అర్ధరాత్రి వేళ దిల్లీలోని కాశ్మీరీ గేట్ బస్ టెర్మినల్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద బాధితురాలిని బస్సు నుంచి కిందకు తోసేసి నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో ఈ అమానవీయ ఘటన వెలుగులోకి వచ్చింది.

వర్క్‌షాప్ బస్సు...

తనిఖీ లేని ప్రయాణం: దర్యాప్తు అధికారుల ప్రాథమిక విచారణలో నివ్వెరపోయే నిజాలు వెలుగుచూశాయి. సాంకేతిక లోపం కారణంగా ఆ బస్సును మరమ్మతుల నిమిత్తం గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పుర్ వర్క్‌షాప్‌కు తీసుకొచ్చారు. బాగుచేసిన అనంతరం సాయంత్రం సమయంలో నిందితులిద్దరూ బస్సును తీసుకుని బయలుదేరారు. సూరజ్‌పుర్ నుంచి పరీ చౌక్‌కు చేరుకుని, అక్కడ అమాయక బాలికను ఉచ్చులోకి లాగి ఈ దారుణానికి పాల్పడ్డారు. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన హైటెక్ నిఘా వ్యవస్థలు, చెక్‌పోస్టులు ప్రయాణికులు లేని ప్రైవేటు స్లీపర్ బస్సులను ఎందుకు తనిఖీ చేయడం లేదనే అంశంపై సర్వత్రా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్భయ ఘటన తర్వాత తీసుకొచ్చిన నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

## బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి.. కవిత మధ్యలో వచ్చి మధ్యలో వెళ్లిపోయింది

నిజామాబాద్ : సీఆర్‌కు కష్టకాలంలో వెంట ఉన్నది ఎవరో ముందు కవిత తెలుసుకోవాలి. నీ వల్ల నీ తండ్రి కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో ఆలోచించావా కవిత? మిమ్మల్ని కలుపడానికే ప్రయత్నించానే తప్పా విడగొట్టడానికి కాదు అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తనపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై వేముల స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను ఏం చేశానే ఉద్యమ నాయకుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్పష్టంగా తెలుసన్నారు. పార్టీ లైను దాటిన తర్వాతనే కవితపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం

నేను మా తండ్రి వేముల సురేందర్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం . 2001 తెలంగాణ ఆవిర్భావా ని కన్న ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే బీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చింద్రు మధ్యలో పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత... ఇప్పుడు కష్ట కాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా కవితనా? అని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది ఎవరో అందరికి తెలుసన్నారు.లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదని స్పష్టం చేశారు. కవిత కాంగ్రెస్ నాయకులతో రహస్యంగా మంతనాలు చేయలేదని చెప్పగలదా? అని నిలదీశారు. నిరాధారణమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం చేస్తున్నావని మండిపడ్డారు. స్వలాభం కోసం వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బ తీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదని హితవు పలికారు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని తెలిపారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నా వాళ్లను కవిత



టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.

అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తున్నది

కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని విమర్శించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడం రాజకీయంగా సింపతిని గేన్ చేయడానికి అని అర్థం అవుతుందని, అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నామని పేర్కొన్నారు. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించ డం లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ఆయన పైన కేటీఆర్ పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదన్నారు. కానీ బాధగా అనిపించిందన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవిత పై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందన్నారు.

## మిర్యాలగూడలో కేటీఆర్ రైతు సభ నిర్వహించి తీరుతాం



సూర్యాపేట: రాష్ట్రంలో నీటి సమస్యలు తీవ్రంగా మారుతున్నా ప్రభుత్వ పెద్దలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అవినీతి సొమ్మును లెక్కించే పనిలో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయని జగదీశ్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అంటే అనుక్షణం భయంతోనే రేవంత్ రెడ్డి రోత మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను ఎక్కువగా గుర్తు చేసుకునే వారిలో రేవంత్ రెడ్డిదే ప్రథమ స్థానమని ఎద్దేవా చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారో లెక్కలు తీయడానికి సిద్ధమా? అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టుపై మాట్లాడే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు లేదని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కళ్లముందే నీరు కనిపిస్తున్నా ఆ నీటిని ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తుంటే అడ్డుకోలేని పరిస్థితికి ప్రభుత్వ అసమర్థత, అవినీతే కారణమని ఆరోపించారు.తనకు రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించిన మహబూబ్‌నగర్ జిల్లాకు రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో మళ్లీ వలసలు పెరగడానికి ప్రభుత్వ విధానాలే కారణమవుతున్నాయని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా జిల్లా మంత్రులు నోరు మెదపడం లేదని ఆయన మండిపడ్డారు. కళ్ల ముందే నీటి సమస్యలు కనిపిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.రాష్ట్రంలోని అనేక పట్టణాలు, పల్లెల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని జగదీశ్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్, తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టామని, ప్రస్తుత ప్రభుత్వం కరెంట్, నీరు అందించడంలో విఫలమైందని విమర్శించారు. "కేసీఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ము నీకుందా?" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలపై రేపటి నుంచి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట ప్రారంభమవుతుం దని జగదీశ్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యంగా రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.

మిర్యాలగూడలో కేటీఆర్ రైతు సభ

రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై కేటీఆర్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ రైతు సభ నిర్వహించనున్నట్లు జగదీశ్ రెడ్డి తెలిపారు. ఈ సభకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా మిర్యాలగూడలో కేటీఆర్ రైతు సభను నిర్వహించి తీరుతామని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హై కోర్టులో ఊరట



హైదరాబాద్, సెప్టెంబర్ 1: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 3వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటి వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని మార్చాలనే సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది.తదుపరి ఆదేశాల వరకు లోతుకుంటా భూముల జోలికి వెళ్లవద్దని హైకోర్టు స్పష్టం చేసింది.హైడ్రా కమిషనర్ రంగనాథ్ తరఫున హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు హైడ్రా కమిషనర్ వెళ్లిన విషయం తెలిసిందే.

## హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌ల ను ఏర్పాటు చేయడా నికి ఆసక్తి చూపిస్తోందని చెప్పుకొచ్చారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్ తో చర్చలు సానుకూలంగా జరిగాయని వివరించారు. నాదీూ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ తోనూ సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారు.వీ×ు, అమెరికాలో ని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాల తోనూ చర్చలు ఫలప్రదమయ్యా యని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంయుక్త పరిశోధనలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ



ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల డ్రాలో 'దానం' దాడి : అధికారుల తీరుపై ఎమ్మెల్యే ధ్వజం

హైదరాబాద్, హైదరాబాద్ నగరంలో నిరుపేదల సొంతింటి కలలను నిజం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా ప్రక్రియ అనూహ్య వివాదానికి కేంద్రబిందువైంది. ప్రజాప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా జరగాల్సిన ఈ ఎంపిక ప్రక్రియలో నిబంధనలు గాలికొదిలేశారా? క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి అధికారులే ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారా? సాక్షాత్తూ అధికార పార్టీ శాసనసభ్యుడే హౌసింగ్ బోర్డు ఉన్నతాధికారుల తీరుపై నిప్పులు చెరగడం వెనుక ఉన్న అసలు మతలబు ఏమిటి?

ప్రోటోకాల్‌కు పాతర.. ఎమ్మెల్యే రాకముందే డ్రా : బంజారాహిల్స్‌లోని కుమ్రం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపిక కోసం హౌసింగ్ బోర్డు అధికారులు లక్కీ డ్రా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ వేదిక వద్దకు చేరుకోకముందే అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి లక్కీ డ్రాను ప్రారంభించి ముగించేశారు. కనీస ప్రోటోకాల్ పాటించకుండా, స్థానిక ప్రజాప్రతినిధికి సమాచారం లేకుండా తూతూమంత్రంగా ప్రక్రియను ఎలా కానిచ్చేస్తారంటూ నాగేందర్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్థానికులకు మొండిచేయి..

నియోజకవర్గంలో లేనివారికే అందలమా? ఇళ్ల కేటాయింపులో జరిగిన గణాంకాలను ఎమ్మెల్యే మీడియా ముందు ప్రస్తావించారు: హామీ 500.. దక్కింది 120 మాత్రమే: ప్రభుత్వం మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని ప్రకటించింది. కానీ ఖైరతాబాద్ నియోజకవర్గ స్థానికులకు కేవలం 120 ఇళ్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారని

## ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలి: పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, సెప్టెంబర్ 1: సెప్టెంబర్ 14 నుంచి జరిగే గణేశ్ ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రిగా సన్నాహక సమావేశం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉన్నతాధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితితో సమావేశం జరిగిందని.. ఉత్సవాల ప్రశాంతంగా జరగడంపై చర్చించినట్లు చెప్పారు. సామూహిక ఉత్సవాలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గణేశ్ మండపాల నిర్వహణ, శానిటేషన్, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుపై చర్చించామన్నారు. భక్తులకు మొక్కల పంపిణీ చేయాలని, చేనేత కండువాలు వాడాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితిని కోరామన్నారు.మట్టి వినాయకులను వాడి... పర్యావరణాన్ని కాపాడాలని మంత్రి పిలుపునిచ్చారు. బోనాల ఉత్సవాల సమయంలో మంచి వర్షాలు కురవాలని అన్ని ఆలయాల్లో పూజలు చేసినట్లు తెలిపారు. వినాయక మండపాల్లో ఎల్‌నినో కష్టాల నుంచి గట్టెక్కించి.. మంచి వర్షాలు కురవాలని పూజలు చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితికి ప్రభుత్వం నుంచి సూచించామన్నారు. కోర్టులను గౌరవిస్తూనే ఉత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.



## ఏఐసీసీ ఆఫీసుకు చేరిన సురేఖ వివాదం

న్యూఢిల్లీ, గాంధీభవన్ నుంచి బెంగళూరు వరకు.. తెలంగాణ కాంగ్రెస్‌లో సురేఖ ఎపిసోడ్ కాక రేపుతోంది. మంత్రి కొండా సురేఖపై క్రమశిక్షణ కమిటీ చర్యలకు సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. తుది నిర్ణయం ఏఐసీసీదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఖర్గేతో భేటీ కావడం హాట్‌టాపిక్‌గా మారింది. తెలంగాణ టు ఢిల్లీ.. వయా బెంగళూరు.. తెలంగాణ కాంగ్రెస్‌లో అసలేం జరుగుతుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.కొండా సురేఖ కుటుంబం చేసిన వ్యాఖ్యలతో వివాదం మొదలైంది. సీఎం రేవంత్‌రెడ్డిపై వచ్చిన వ్యాఖ్యలు పార్టీలో చర్చకు దారితీశాయి. సురేఖ వాటిని ఖండించలేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో క్రమశిక్షణ కమిటీ రంగంలోకి దిగింది. సురేఖతో పాటు మరో సీనియర్ నేత జి.చిన్నారెడ్డిపై కూడా చర్యలకు సిఫారసు చేసేందని సమాచారం వస్తోంది. ఇక తుది నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోకి వెళ్లిందిక్కడే అసలు రాజకీయ చర్చ మొదలైంది. ఇది కేవలం వ్యక్తుల మధ్య వివాదమా లేక తెలంగాణ కాంగ్రెస్‌లో పవర్ బ్యాలెన్స్ మారుతోందా అనే వాదన వచ్చింది. ఉమ్మడి వరంగల్‌లోని పాత విభేదాలు కూడా ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. కొండా సురేఖ, కొండా మురళీకి.. అక్కడి కాంగ్రెస్ నేతలతో విభేదాలు కొత్త కాదు. గతంలోనూ కొండా మురళీ పార్టీ అంతర్గత అంశాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఆ పాత విభేదాలకు కొత్త వివాదం తోడైందన్న చర్చ జరుగుతోంది.కొండా సురేఖ గతంలోనూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2024లో కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో సమంత, నాగచైతన్య అంశాన్ని ప్రస్తావించారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. తర్వాత సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పారు. అయితే ఆ వివాదం రాజకీయ ప్రత్యర్థులపై విమర్శల వరకే పరిమితమైంది. ఇప్పుడు పరిస్థితి వేరు. ఈసారి వ్యవహారం నేరుగా పార్టీ, ప్రభుత్వం, సీఎం, పీసీసీ నాయకత్వం వరకు వెళ్లింది.కాంగ్రెస్‌లో విమర్శలు కొత్త కాదు. సీఎం, పీసీసీ చీఫ్‌లపై గతంలోనూ సొంత పార్టీ నేతలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. భిన్నాభిప్రాయాలు కూడా కాంగ్రెస్‌లో ఎప్పటి నుంచో ఉన్నాయి. అయితే ప్రతి వ్యాఖ్యకు చర్య ఉండదు. సందర్భం ఏంటి? పార్టీకి నష్టం ఎంత? వ్యాఖ్యలు ఎవరిపై? పార్టీ లైన్ దాటారా? అన్నదే కీలకం. సురేఖ విషయంలో గీత ఎక్కడ గీస్తారనే ఆసక్తికరంగా మారింది.తెలంగాణలో 2014 నుంచి 2023 వరకు కాంగ్రెస్ అధికారంలో లేదు. 2023లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చింది. కాబట్టి వివాదాస్పద వ్యాఖ్యలతో కాంగ్రెస్ మంత్రిని కేబినెట్ నుంచి తప్పించిన స్పష్టమైన పాత ఉదాహరణ తెలంగాణలో కనిపించదు.అందుకే సురేఖపై నిర్ణయం కీలకం.. చర్య తీసుకుంటే.. క్రమశిక్షణ విషయంలో పార్టీ కఠినంగా ఉందన్న సంకేతం వెళ్తుంది. చర్య తీసుకోకపోతే.. సిఫారసులపై వెనక్కి తగ్గారన్న విమర్శ రావచ్చు.సురేఖ వ్యవహారంలో బీసీ రాజకీయాలు కూడా తెరపైకి వచ్చాయి. తనపై చర్యల చర్చ సమయంలో బీసీ ప్రాతినిధ్యం అంశం ప్రాధాన్యం పొందింది. అయితే రెండు అంశాలను వేరు చేయాల్సిందే. బీసీ ప్రాతినిధ్యం ఒక రాజకీయ అంశం. క్రమశిక్షణ మరో అంశం. బీసీ కార్డు రాజకీయంగా బలం ఇవ్వొచ్చు. కానీ క్రమశిక్షణపై పార్టీ నిర్ణయం మాత్రం దాని ఆధారంగా మాత్రమే ఉండకపోవచ్చు. అదే సమయంలో సామాజిక సమీకరణాలను విస్మరించడం కూడా కాంగ్రెస్‌కు అంత సులభం కాదు. భట్టి విక్రమార్క.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో భేటీ కావడంతో చర్చ మరింత పెరిగింది. సురేఖ వ్యవహారంతో పాటు తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితులపై భట్టి వివరించారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ పరిస్థితులు.. ఎమ్మెల్యేలు, విప్‌ల అసంతృప్తి.. పార్టీ, ప్రభుత్వంపై ప్రభావం.. వంటి అంశాలు చర్చకు వచ్చాయంటున్నారు. అయితే భట్టి ఖర్గేతో ఏం మాట్లాడారన్నది అధికారికంగా వెల్లడికాలేదు. అందుకే ఇవన్నీ ప్రస్తుతం పార్టీ వర్గాల సమాచారం, రాజకీయ అంచనాలుగానే చూడాలి. ఇదే ఇప్పుడు పెద్ద ప్రశ్న. సురేఖపై చర్య అనేది ఒక్క మంత్రి వ్యవహారంగా కనిపించినా.. దాని ప్రభావం చాలా దూరం వెళ్లొచ్చు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వైఖరి. మంత్రుల మధ్య సమన్వయం. వరంగల్ రాజకీయాలు. బీసీ సమీకరణాలు అన్నీ ఇందులో కలుస్తున్నాయి. అందుకే ఈ నిర్ణయం సురేఖ భవిష్యత్తుతో పాటు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయ దిశను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. సురేఖపై కఠిన చర్య తీసుకుంటే పార్టీ క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని కాంగ్రెస్ చెప్పొచ్చు. కానీ వరంగల్‌లో అసంతృప్తి పెరగొచ్చు. బీసీ రాజకీయాలపైనా చర్చ పెరగొచ్చు. చర్య తీసుకోకపోతే పార్టీ క్రమశిక్షణా కమిటీ సిఫారసును ఎందుకు పక్కన పెట్టారన్న ప్రశ్న వస్తుంది. ఇతర నేతలకు కూడా తప్పుడు సంకేతం వెళ్తుందన్న విమర్శలు రావొచ్చుఇప్పుడు పంచాయితీ గాంధీభవన్ దాటి అధిష్ఠానం వరకు వెళ్లింది. ఖర్గే స్థాయిలో చర్చకు వచ్చింది. కేసీ వేణుగోపాల్ తిరిగి వచ్చిన తర్వాత తుది నిర్ణయం ఉండొచ్చన్న ప్రచారం కూడా ఉంది. మంత్రి పదవి నుంచి తొలగిస్తారా? పార్టీ పరంగా మాత్రమే చర్య తీసుకుంటారా? లేక చివరకు సర్దుబాటు చేస్తారా అనే ఉత్కంఠకు తెరపడనుంది. ఈ క్రమంలోనే.. ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కొండా సురేఖ ఫొటో లేకపోవడం ఇప్పుడు మరో సంచలనంగా మారింది. మొత్తంగా ఇది కొండా సురేఖ వర్సెస్ కాంగ్రెస్ అన్నంత సింపుల్ వ్యవహారం కాదు. పార్టీ క్రమశిక్షణ. ప్రభుత్వ ప్రతిష్ఠ. వరంగల్ రాజకీయాలు. బీసీ సమీకరణాలు. నాయకత్వ బలం అన్నీ ఇందులో ఉన్నాయి. సురేఖ ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్ గాంధీభవన్‌లో పడుతుందా? బెంగళూరులో ఖర్గే నిర్ణయంతో పడుతుందా? లేక ఢిల్లీ నుంచి వచ్చే ఆదేశాల తర్వాతే పంచాయితీ ముగుస్తుందా అన్నది వేచి చూడాలి.

## హీట్ పుట్టిస్తున్న పులివెందుల

కడప ,ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాయలసీమ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో సరికొత్త పొలిటికల్ హీట్ మొదలైంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి దశాబ్దాలుగా తిరుగులేని కోటగా, అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత గడ్డగా ఉన్న పులివెందుల మున్సిపాలిటీని ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా సానుకూల వాతావరణం నెలకొనడంతో.. పులివెందుల పురపాలక సంఘంపై పసుపు జెండా ఎగురవేయడమే లక్ష్యంగా టీడీపీ అడుగులు వేస్తోంది. ఈ మెగా పొలిటికల్ మిషన్‌ను విజయవంతం చేసేందుకు టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి క్షేత్రస్థాయిలో సీరియస్ ఫోకస్ పెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పులివెందులలోని ప్రతి వార్డులోనూ కూటమి శ్రేణులను ఏకం చేస్తూ, వైకాపాకు గట్టి పోటీ ఇచ్చే బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ఆయన వ్యూహాత్మకంగా కసరత్తులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైకాపా అవినీతిని, గత ఐదేళ్ల వైఫల్యాలను ఎండగడుతూ.. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌ల పూర్తి మద్దతుతో బీటెక్ రవి దూసుకుపోతుండటం ఇక్కడి రాజకీయాలలో ఊహించని మార్పులకు దారితీస్తోంది. రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం.. ఈసారి పులివెందుల మున్సిపాలిటీని కాపాడుకోవడం వైఎస్ జగన్‌కు అంత సులువైన వ్యవహారం కాదు. గత స్థానిక ఎన్నికల్లో అధికార బలంతో ఏకగ్రీవాలు చేసుకున్న వైకాపాకు, ఈసారి కూటమి ప్రభుత్వం వంద శాతం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తుండటం పెద్ద సవాల్‌గా మారింది.

# బీజేపీ బస్తీమే సవాల్.. గ్రేటర్ వార్!

హైదరాబాద్, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారమే లక్ష్యమంటున్న తెలంగాణ భారతీయ జనతా పార్టీకి హైదరాబాద్ మహానగరంలో జరగనున్న ఎన్నికలు ప్రీ ఫైనల్‌గా మారుతున్నాయి. ఆ పార్టీకి చెందిన ఏ నాయకుడిని కదిలించినా.. చర్చ గ్రేటర్ ఎన్నికల పైనే జరుగుతోంది. ఈసారి సాధించి తీరుతామన్న ధీమా, పట్టుదల కేడర్‌లో కనిపిస్తున్నప్పటికీ కొన్ని అంశాల్లో ప్రతికూలత తప్పదనిపిస్తోంది. ఈ క్రమంలో రెండు బలమైన రాజకీయ పక్షాలను తట్టుకుని నిలబడగలమా? అన్న సందేహం కూడా వారిని వెంటాడుతోంది. ఓ వైపు అధికార కాంగ్రెస్ పార్టీ, మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ వ్యూహాలు, ఎత్తుగడలను తట్టుకుని పైచేయి సాధించడం అనుకున్నంత సులువైనది కాదని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. బస్తీమే సవాల్ అంటూ.. ఆ పార్టీ నేతలు సవాళ్లు విసురుతున్నప్పటికీ లోపల అంతుచిక్కని మథనం కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండు ప్రధాన రాజకీయ పక్షాలను అధిగమించే క్రమంలో ఎదురయ్యే అవాతంరాలు, అడ్డంకులు, ఆర్థికపరమైన అంశాలతో కూడిన సవాళ్లను అనుసరించాలన్న కోణంలో ప్రస్తుతం మేధోమథనం జరుగుతోంది. గ్రేటర్ ట్రై కార్పొరేషన్ల ఎన్నికలు బీజేపీకి రెఫరెండమేనని, ఒకవేళ అనుకున్నది సాధించి మేయర్ పీఠాలను అధిష్టిస్తే, 2028 తర్వాత జరిగే సార్వత్రిక ఎన్నికల్లో విజయావకాశాలు మెండుగా ఉన్నట్లేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్‌లో జరగాల్సిన మూడు కార్పొరేషన్ల ఎన్నికలపై భారతీయ జనతా పార్టీ తన పొలిటికల్ ఫోకస్‌ను తీవ్రం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడు ప్రధాన కార్పొరేషన్లతో పాటు, నార్త్ తెలంగాణకు గుండెకాయ లాంటి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని బీజేపీ అధిష్ఠానం పక్కా వ్యూహాన్ని రచిస్తోంది. ఇప్పటికే నితిన్ నవీన్ మూడు రోజుల పాటు పర్యటించి.. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలోని బూత్ ప్రెసిడెంట్లతో, రాష్ట్ర కార్యవర్గంతో జరిపిన కీలక భేటీలలో దీనికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైంది. ఇక్కడి సమస్యలను గుర్తించి నేతల మధ్య సయోధ్య ప్రయత్నాలు కూడా పూర్తి చేశారు. ఈ మెగా ఎన్నికల సమరానికి సంబంధించి వ్యూహాల అమలు, నిధులు, వనరుల సమీకరణపై బీజేపీ అగ్రనాయకత్వం ఒక స్పష్టమైన బ్లూప్రింట్‌ను ఖరారు చేసింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, వరంగల్ అర్బన్ బెల్ట్‌లో పార్టీకి వచ్చిన భారీ ఓటింగ్ శాతాన్ని క్షేత్రస్థాయిలో సీట్లుగా మార్చుకోవడమే బీజేపీ అగ్రనేతల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలో కేవలం సోషల్ మీడియా ప్రచారాలకే పరిమితం కాకుండా, ప్రతి డివిజన్‌లోనూ బలమైన ఆర్థిక, అంగబలం ఉన్న అభ్యర్థులను ఇప్పుడే గుర్తించి వారికి రూట్ మ్యాప్ ఇవ్వాలని, ఎన్నికల ఖర్చులకు వెనకాడకుండా వనరులను ముందే సర్దాలని ఈ కీలక భేటీలో నిర్ణయించారు. బీజేపీ లీడర్‌షిప్ ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ కార్పొరేషన్ల పరిధిలో నిశ్శబ్దంగా అంతర్గత సర్వేలు చేయించింది. సిట్టింగ్ కార్పొరేటర్ల పనితీరు, అధికార కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న యాంటీఇంకంబెన్సీ, బీఆర్ఎస్ కేడర్ బలాబలాలపై స్పష్టమైన రిపోర్ట్ సిద్ధం చేసుకుంది. ఈ సర్వే నివేదికల ఆధారంగానే వరంగల్ కార్పొరేషన్‌లో ఈసారి క్లీన్ స్వీప్ చేయాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. వరంగల్‌లో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ క్రమంగా పడిపోతుండటం, కాంగ్రెస్ అంతర్గత విభేదాలు తమకు కలిసివస్తాయని కమలనాథులు అంచనా వేస్తున్నారు. ఇటు హైదరాబాద్ పరిధిలోని సైబరాబాద్, మల్కాజ్‌గిరి ఐటీ, అర్బన్ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రచారాస్త్రాలుగా మలుకుని రాజకీయంగా లబ్ధి పొందే ప్రయత్నాలు ఇప్పటి నుంచే ముమ్మరం చేశారు. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలను అప్రమత్తం చేస్తూ.. పోటీకి దిగే అభ్యర్థుల విషయంలోనూ అత్యంత ముందుచూపుతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాజకీయంగా బద్ధ శత్రువైన మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ దోస్తీని హైలెట్ చేయనున్న బీజేపీ.. హిందూత్వ కార్డును అత్యంత బలంగా ఉపయోగించాలని భావిస్తోంది. గడిచిన పార్లమెంట్ (2024లో జరిగిన ఎన్నికలు) ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానం నుంచి మహిళా అభ్యర్థిని బరిలో దింపి, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీకి బలమైన పోటీ ఇవ్వడంతో పాటు తమకు ఎదురేలేదన్న ఎంఐఎం నాయకులు అహంకారాన్ని సగానికి తగ్గించిందిఈసారి అంతకు మించిన వ్యూహంతో గ్రేటర్‌ను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పొలిటికల్ వార్‌ను మొదలు పెట్టాలనుకుంటోంది. ప్రస్తుతానికి అధికార కాంగ్రెస్ పార్టీ నగరాల్లో పట్టు కోసం చూస్తుండగా, పాత బస్తీకి పరిమితమైన ఎంఐఎంతో దోస్తీ కట్టి లబ్ధి పొందాలని చూస్తోందని.. దీనిని హిందూ ఓటర్లలో సెంటిమెంట్‌గా మార్చాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. రాబోయే రెండు, మూడు నెలల్లోనే ఈ గ్రేటర్ ఎన్నికల నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉన్నందున.. అభ్యర్థుల ఎంపిక నుండి పోలింగ్ బూత్ మేనేజ్‌మెంట్ వరకు అంతా ముందే సెట్ చేసుకోవాలనే కమల వ్యూహం, తెలంగాణ రాజధాని కార్పొరేషన్ల పీఠాలపై ఏ మేరకు జెండా పాతేలా చేస్తుందోనన్న ఉత్కంఠ బీజేపీ అభిమానుల్లో, కాషాయదళంలో కనిపిస్తోంది. ఈ త్రిముఖ కార్పొరేషన్ పోరు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ గమనాన్ని మార్చనుంది. కాంగ్రెస్ అధికార బలాన్ని, వ్యూహాలను తట్టుకుని నిలబడాలంటే బీజేపీ కేవలం సోషల్ మీడియా పాలిటిక్స్ నమ్ముకుంటే సరిపోదు.. క్షేత్రస్థాయిలో రోడ్ల పైకి వచ్చి పోరాడాల్సి ఉంటుంది. జాతీయ నాయకత్వం పంపిన అల్టిమేటంతో అప్రమత్తమైన తెలంగాణ బీజేపీ లీడర్లు.. ఈ ఎన్నికలను జీవన్మరణ సమస్యగా భావించి సరికొత్త కార్యాచరణతో ముందుకు కదులుతున్నారు. ఒకవేళ ఈ మూడు స్థానాల్లో బీజేపీ మెజారిటీ సాధిస్తే.. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకునే గోల్డెన్ ఛాన్స్ దక్కుతుందన్న బలమైన ధీమా కాషాయదళంలో కనిపిస్తోంది.

**గ్రేటర్ త్రిశూల పోరుకు బీజేపీ జంగ్ సైరన్ !**

మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో బీజేపీ గెలవకపోతే భవిష్యత్తు శూన్యమేనా? అన్న ప్రశ్న కూడా ఆ పార్టీ నేతలను వెంటాడుతోంది. తెలంగాణ రాజకీయాల్లో తదుపరి సమరం హైదరాబాద్ మహానగరం వేదికగా ప్రారంభం కానుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం పాత 1955 నాటి యాక్టును రద్దు చేసి పాత గ్రేటర్ నగరాన్ని మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించింది. డివిజన్ల సంఖ్యను 150 నుండి ఏకంగా 300కు పెంచి ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ వేస్తున్న ఈ త్రిశూల వ్యూహాన్ని తిప్పికొట్టి, హైదరాబాద్పై ఎలాగైనా జెండా ఎగరేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ హైకమాండ్ తన వ్యూహాలకు పదును పెట్టింది. ఇందులో భాగంగానే ఇటీవల బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అగ్రనేత నితిన్ నబీన్ సిన్హా ఇటీవలే హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా పర్యటించి వ్యూహాన్ని నూరిపోశారు. అదే సమయంలో రాష్ట్ర కోర్ కమిటీ నేతలకు గట్టి వార్నింగ్ ఇస్తూ దిశానిర్దేశం చేసి వెళ్లారు. నితిన్ నవీన్ తన అంతర్గత సమావేశాల్లో రాష్ట్ర నేతలకు అత్యంత స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. పట్టణ ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ సిటీలు ఎప్పుడూ బీజేపీకి బలమైన కోటలు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ చుట్టుపక్కల ఎంపీ స్థానాలు గెలిచినంత మాత్రాన సరిపోదు.. ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో మన సత్తా చాటకపోతే, తెలంగాణలో అధికారం చేపడతామనే బీజేపీ కల భవిష్యత్తులో కేవలం కలగానే మిగిలిపోతుంది అని ఆయన కుండబద్దలు కొట్టారు. నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కనబెట్టి, కలిసికట్టుగా పోరాడకపోతే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

**మూడు ముక్కల వ్యూహం వెనక కాంగ్రెస్ పొలిటికల్ స్కెచ్**

దశాబ్దాల పాటు ఉమ్మడి సంస్థగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించడం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ స్కెచ్ కనిపిస్తోంది. ఓల్డ్ సిటీ-పరిధిలోని హైదరాబాద్ , ఐటీ కారిడార్ ఉన్న సైబరాబాద్ , ఉద్యోగులు-మధ్యతరగతి ఎక్కువగా ఉండే మల్కాజ్గిరి .. ఈ మూడింటికీ వేర్వేరు వ్యూహాలు కావాలని నితిన్ నవీన్ స్పష్టం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలకు ఇవి కేవలం మున్సిపల్ ఎన్నికలు కావు.. వారి సొంత రాజకీయ భవిష్యత్తును, ఉనికిని చాటు కోవడానికి ఒక అగ్నిపరీక్ష. అందుకే జాతీయ అధ్యక్షుడి పర్యటన ముగిసిన వెంటనే తెలంగాణ బీజేపీ నేతలంతా గ్రేటర్ మున్సిపల్ పరిధిపై అంతర్గత కసరత్తు తీవ్రం చేశారు. గత 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 48 స్థానాలు గెలుచుకుని బీఆర్ఎస్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పుడు బీఆర్ఎస్ బాగా బలహీనపడిన తరుణంలో.. ఆ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు వెళ్లకుండా పూర్తిగా తమ వైపు తిప్పుకోవడమే బీజేపీ ముందున్న అసలైన టాస్క్‌గా నిలుస్తోంది. కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ , మల్కాజ్గిరి కార్పొరేషన్ల పరిధిలో ఐటీ ఉద్యోగులు, వలస ప్రజలు, ఇతర రాష్ట్రాల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ సెగ్మెంట్ సాంప్రదాయకంగా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఇష్టపడుతుంది కాబట్టి, ఇక్కడ క్షేత్రస్థాయిలో సరైన అభ్యర్థులను నిలబెడితే మేజర్గా లాభపడొచ్చని బీజేపీ భావిస్తోంది. ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు బూచీని చూపిస్తూ గ్రేటర్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసే పనిలో బీజేపీ శ్రేణులు నిమగ్నమయ్యాయి.

# శిథిలాల కింద మరిన్ని విషాదగాథలు...



ఖాట్మాండు, నేపాల్‌ను అతలాకుతలం చేసిన వరదలు, బురద ప్రవాహాల విషాదం నుంచి హృదయాన్ని పిండేసే ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఎటు చూసినా శిథిలాలు.. బురదలో కొట్టుకుపోయిన ఇళ్లు.. తమవారి కోసం కన్నీరు పెట్టుకుంటున్న కుటుంబాలు కనిపిస్తున్నాయి. ఈ విషాదం మధ్య ఓ చిన్నారి తన చెల్లెలిని గుండెలకు హత్తుకుని తల్లిదండ్రుల కోసం వెతుకుతున్న దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ దృశ్యం చూసిన ప్రతి ఒక్కరి కళ్లలో కన్నీళ్లు తెప్పిస్తోంది. తనకే రక్షణ కావాల్సిన వయసులో ఆ చిన్నారి మాత్రం చెల్లెలికి రక్షణగా నిలిచాడు. చుట్టూ విధ్వంసం కనిపిస్తున్నా.. ఎక్కడ తమవారు ఉన్నారో తెలియకపోయినా.. తన చెల్లెలిని మాత్రం వదిలిపెట్టలేదు. ఆమెకు ఏమీ కాకూడదన్నట్లుగా ఒడిలో ఎత్తుకుని ముందుకు సాగుతున్నాడు. వారి తల్లిదండ్రుల ఆచూకీ కోసం ఆ చిన్నారులు ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. తన చెల్లెలిని గట్టిగా హత్తుకున్న ఆ బాలుడి దృశ్యం చూసి నెటిజన్లు భావోద్వేగానికి గురవుతున్నారు. తమ తల్లిదండ్రులు క్షేమంగా తిరిగి రావాలని, ఆ పిల్లలు మళ్లీ వారి ఒడికి చేరాలని పలువురు ప్రార్థిస్తున్నారు. ఇదే నేపాల్ విపత్తులో మరో అద్భుత ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. నేపాల్-చైనా సరిహద్దు సమీపంలో బురద ప్రవాహం ముంచెత్తిన ప్రాంతంలో ఆరేళ్ల చిన్నారి శిథిలాల కింద చిక్కుకుంది. విపత్తు సంభవించి రెండు రోజులకుపైగా గడిచిపోయినా ఆమె ప్రాణాలతో ఉండటం సహాయక సిబ్బందినే ఆశ్చర్యానికి గురిచేసింది. శిథిలాల మధ్య నుంచి చిన్నారి ఏడుపు వినిపించడంతో అక్కడి సిబ్బంది వెంటనే గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. బురదతో నిండిపోయిన శిథిలాల మధ్య చిన్నారి ముఖం మాత్రమే కనిపిస్తుండగా, ఎంతో జాగ్రత్తగా ఆ చిన్నారిని బయటకు తీశారు. దాదాపు 55 గంటల తర్వాత ప్రాణాలతో బయటపడిన ఆ చిన్నారి ఘటనను ఓ మిరాకిల్ గా అభివర్ణిస్తున్నారు. ఆమె ముఖం, వీపుపై గాయాలైనప్పటికీ ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు. వెంటనే ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఖాట్మాండులోని ఆసుపత్రికి తరలించారు. రహదారులు పూర్తిగా కొట్టుకుపోవడంతో హెలికాప్టర్ ద్వారానే సహాయక బృందాలు ఆ ప్రాంతానికి చేరుకున్నట్లు సమాచారం. భారీ వర్షాలు, వరదల కారణంగా గాలింపు చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ.. శిథిలాల కింద ఇంకా ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమోనన్న ఆశతో సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. శిథిలాల కింద నుంచి మరిన్ని విషాద కథలు బయటపడుతున్నాయి. నేపాల్‌లో సంభవించిన ఈ విపత్తు ప్రతి కుటుంబం వెనుక తీరని వేదనను, కన్నీటి గాథను మిగిల్చింది. గల్లంతైన వారి కోసం కుటుంబ సభ్యులు ఆశగా ఎదురుచూస్తుండగా, సహాయక బృందాలు శిథిలాల మధ్య నిరంతరం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

## ఖమ్మంలో అరుదైన తైటా గుడ్లగూబ ప్రత్యక్షం

ఖమ్మం,ఖమ్మం సోమారం గ్రామంలో అరుదైన తైటా గుడ్లగూబ కనిపించింది. అవుల ప్రవీణ్ ఇంటి సమీపంలో గాయాలతో కనిపించిన గుడ్లగూబ ఎగరలేకపోయింది. అటవీ అధికారులు గుడ్లగూబను గుర్తించారు.

## రికార్డు స్థాయిలో బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టు

ఒంగోలు,ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధిలో జలవనరుల మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమైనది. తీవ్రమవుతున్న వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రతికూల ప్రభావాలు రాష్ట్ర వ్యవసాయ రంగంపై పడకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకే వారంలో దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్న రెండు బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టుల్లో రికార్డు స్థాయిలో పనులను పూర్తి చేయించి, ప్రారంభోత్సవాలకు వేదిక సిద్ధం చేస్తున్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల దాహార్తిని తీర్చే వెలిగొండ, ఉత్తరాంధ్ర ఆశల నిలయమైన పోలవరం ఎడమ కాలువ పనులను పరుగులు పెట్టించడం ద్వారా సర్కార్ తన పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకుంటోంది. రాయలసీమలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు, ప్రకాశం , నెల్లూరు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలకు జీవనాడిగా మారిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి నల్లమల అడవుల గుండా నీటిని తరలించే ఈ సంక్లిష్టమైన ఇంజనీరింగ్ పనులను సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రకాశం జిల్లాలోని కంభం, మార్కాపురం, ఎర్రగొండపాలెం ప్రాంతాలకు తక్షణమే నీరందించడమే లక్ష్యంగా మైక్రో లెవెల్ ప్లానింగ్ అమలు చేస్తున్నారు. టన్నెల్-1 ద్వారా కృష్ణా జలాలను తరలించి వేసవికి ముందే ప్రకాశం జిల్లా భూములను తడిపేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం కాదు.. మైక్రో లెవెల్ ప్లానింగ్, రోజువారీ పర్యవేక్షణతో గడువులోగా పూర్తి చేసి నీటిని అందించడమే అసలైన డెవలప్‌మెంట్ అన్నట్లుగా పనులు పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర ఆర్థిక వికాసానికి మలుపు తిప్పే పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పూర్తిపై జలవనరుల శాఖ రాత్రింబవళ్లు శ్రమిస్తోంది. గోదావరి వరద జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంతానికి, అనకాపల్లి పారిశ్రామిక కారిడార్లకు తరలించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. గతంలో వదిలేసిన కాలువ గట్ల అనుసంధానం, గ్యాప్-1 , గ్యాప్-2 నిర్మాణ లోపాలను సాంకేతికంగా వేగంగా సరిదిద్దారు. ఈ పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలోని ప్రధాన ఆయకట్టుకు సాగునీరు అందడమే కాకుండా, విశాఖ పరిధిలోని పారిశ్రామిక అవసరాలకు ఉచితంగా తాగు, పారిశ్రామిక నీరు సరఫరా కానుందిఈ రెండు కీలక ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం పడనుంది. విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక ప్రాంతాలకు నీటి భద్రత లభిస్తే మరిన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లు రాష్ట్రానికి తరలివస్తాయి. అదే సమయంలో, తీవ్ర ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతున్న ప్రకాశం జిల్లా గ్రామాలకు కృష్ణా జలాలు అందడం ద్వారా వేలాది మందికి శాశ్వత ఆరోగ్య లబ్ధి చేకూరుతుంది. ఎల్ నినో వల్ల వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ఈ ప్రాజెక్టుల ద్వారా నీటిని నిల్వ చేసి సద్వినియోగం చేసుకోవచ్చని ప్రభుత్వం లెక్కిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాటల కంటే పనులకే ప్రాధాన్యత ఇస్తుందనే సందేశాన్ని ఈ ప్రాజెక్టుల వేగం చాటిచెబుతోంది. గత ప్రభుత్వంలో మందగించిన మౌలిక రంగాన్ని మళ్లీ పట్టాలెక్కించడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడమే కాకుండా, రాబోయే రోజుల్లో 'వాటర్ మేనేజ్‌మెంట్'లో ఏపీని దేశానికే మోడల్‌గా నిలబెట్టాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. ఒకే వారంలో రెండు అతిపెద్ద ప్రాజెక్టులలో మైలురాళ్లను అధిగమించడం రాష్ట్ర జల వనరుల రంగానికి కొత్త ఊపిరి పోసిందనే చెప్పాలి.

## విజయవాడలో 10 చోట్ల ఫ్రీగా వసతి, ఫుడ్

విజయవాడ, విజయవాడకు బతుకుదెరువు కోసం ప్రతి రోజూ ఎంతోమంది వస్తుంటారు. కూలీలు, కార్మికులు, చిరువ్యాపారులు.. ఇలా చాలామంది ఉంటారు. నగరంలో పలు ఎన్జీవోల సాయంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 10 చోట్ల ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డు ఉంటే చాలు ఈ షెల్టర్లలో ఉచితంగా వసతి, తిండి సౌకర్యం ఉంటుంది. చాలామందికి వీటిపై అవగాహన ఉండటం లేదు.. అందుకే అవగాహన కూడా కల్పిస్తున్నారు. చాలామంది ఉపాధి కోసం, ఇతరత్రా పనుల కోసం ప్రతిరోజూ విజయవాడ వస్తుంటారు. అలా వచ్చినవారికి వసతి విషయంలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కొంతమంది లాడ్జి, హోటల్‌లలో గదిని అద్దెకు తీసుకోవడానికి కూడా డబ్బులు లేని పరిస్థితుల్లో ఉంటారు. అలాంటి వారిలో చాలామంది రోడ్లు, బస్టాండ్లలో రాత్రిళ్లు పడుకునేవారు. ఇకపై ఎవరూ వసతి లేకుండా ఇబ్బందిపడకుండా విజయవాడలో సరికొత్త ఆలోచన చేశారు. విజయవాడలో ఉచితంగా ఆశ్రయం, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.. మున్సిపల్ సంస్థలు, ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పిస్తున్నాయి. కేవలం ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది.. ఉచితంగా వసతి పొందొచ్చు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా, వివిధ ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పించేందుకు ఆశ్రయాలు (షెల్టర్లు) ఏర్పాటు చేశారు. జాతీయ పట్టణ జీవనోపాధి పథకం కింద.. నగరంలోని రాణీగారితోట, వైఎస్సార్? కాలనీ, సీతన్నపేట, హనుమాన్ పేట, ఆంధ్రప్రభ కాలనీ, వడ్డెర కాలనీ, రూట్స్ హెల్త్ ఫౌండేషన్, మ్యాంగో మార్కెట్ వంటి పది ప్రాంతాల్లో ఈ ఉచిత షెల్టర్లు ఏర్పాట్లు చేశారు. వసతి పొందాలంటే ఆధార్ కార్డు చూపిస్తే చాలు రూపాయి కూడా తీసుకోకుండా 15 రోజుల పాటు ఉచితంగా వసతి కల్పిస్తారు. ఈ ఉచిత వసతి కల్పన గురించి విజయవాడ కార్పొరేషన్, ఎన్జీవో ప్రతినిధులు నగరంలో ప్రతిరోజూ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత వసతిపై ప్రచారం చేస్తున్నారు. ఒకవేళ ఎవరికైనా కుటుంబం లేకపోతే.. వాళ్లకు ఇక్కడ దీర్ఘకాలికంగా ఆశ్రయం కల్పిస్తున్నారు.. వారికి సమయానికి తిండి పెడుతూ వసతి కల్పిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి 15 నుంచి 20 రోజుల వరకు ఉచితంగా వసతి కల్పిస్తున్నారు. ఇక్కడ దీర్ఘకాలం పాటు నివసించడానికి అవకాశం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. రోడ్లపై నిద్రించాల్సి వచ్చే వారి కోసమే ఈ షెల్టర్లు ఏర్పాటు చేశారని.. కానీ చాలామందికి అవగాహన లేకపోవడంతో ఇక్కడికి రావడం లేదంటున్నారు. అలాగే చాలామంది రోడ్లపై భోజనం పంపిణీ చేస్తుండటంతో ఈ షెల్టర్ల వైపు చూడంట లేదని చెబుతున్నారు. కాబట్టి ఎవరైనా ఆహారం, దుస్తులు, వస్తువులు పంపిణీ చేయాలనుకుంటే నేరుగా ఈ షెల్టర్లకు వచ్చి ఇస్తే బావుంటుందంటున్నారు.

## ఇంటి వద్దకే బస్సు...

విజయవాడ,ప్రయాణికుల కోసం ఏపీఎస్ఆర్టీసీ మరో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టనుంది. ఇంటి వద్దే పికప్ సౌకర్యం కల్పించే ఆలోచన చేస్తోంది. పదిమందికిపైగా బల్క్ బుకింగ్ చేసుకుంటే వారి ఇంటి వద్దకే బస్సును పంపించే ఆలోచన చేస్తోంది. అయితే దూరప్రాంతాలకు వెళ్లే హైయ్యండ్ బస్సు సర్వీసులలోనే ఈ విధానం అమలు చేయనున్నారు. అది కూడా విజయవాడ నగర పరిధిలో మాత్రమే ఈ విధానం అమలు చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఏపీఎస్ఆర్టీసీ ఎప్పటికప్పుడు కొత్త చర్యలు చేపడుతూ వస్తోంది. ప్రయాణికుల ఆదరణ చూరగొనేందుకు కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే విజయవాడ రీజియన్ ఆర్టీసీ అధికారులు ఓ సరికొత్త విధానాన్ని అనుసరించనున్నారు. ప్రయాణికుల ఇంటి వద్దకే బస్సు పికప్ సదుపాయాన్ని కల్పించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అయితే ఇవి కేవలం కొన్ని బస్సులకే అమలు చేయనున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ అగ్రశ్రేణి బస్సులలో

# వైసీపీకి కొత్త శత్రువులు..



విజయవాడ, ఆస్తులు.. అంతస్తులు.. పదవులు.. వీటి కోసమే కదా పెద్దపెద్ద కుటుంబాలలో జరిగే కొట్లాటలు. డబ్బు తాత్కాలికమని తెలుసు. పదవులు శాశ్వతం కాదని తెలుసు. అయినప్పటికీ పెద్ద పెద్ద కుటుంబాల వాళ్ళు వాటికోసం పాకులాడటం.. పోరాటాలు సాగించడం.. చివరికి అయిన వాళ్ళ తో తగువులు పెట్టుకోవడం విశేషం.తెలుగు నాట రాజకీయ కుటుంబాలలో కుటుంబ సభ్యుల మధ్య తగువులు కొత్తకాదు. అధికారం కోసం.. ఆస్తుల కోసం.. ఇతర వ్యవహారాల కోసం తగువులు పెట్టుకొని దూరమైన కుటుంబాలు చాలా ఉన్నాయి. ఆ జాబితాలోకి కల్వకుంట్ల చంద్రశేఖర రావు కుమార్తె కవిత.. వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల చేరిపోవడం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వీరిద్దరి కూడా తమ సోదరులకు అత్యంత ఇష్టమైన సోదరీమణులు. జగన్ జైలో ఉన్నప్పుడు షర్మిల పాదయాత్ర చేశారు. ఒక రకంగా 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడానికి షర్మిల ముఖ్యపాత్ర పోషించారు. ఇక తెలంగాణ ఉద్యమంలో అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితికి అనుబంధంగా తెలంగాణ జాగృతి అనే సంస్థను ఏర్పాటు చేశారు కల్వకుంట్ల కవిత. తన సోదరుడు కేటీఆర్ మీద ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేసినప్పుడు మొహమాటం లేకుండా ఖండించారు కవిత.. అయితే ఎంతో బలమైన బంధాన్ని కొనసాగించిన వీరిద్దరూ తమ సోదరులతో విభేదించడం ఆధునిక రాజకీయాలలో ఒక వైచిత్రి లాగా మారిపోయింది.ఇప్పటికీ కేటీఆర్ మీద కవిత విమర్శలు చేస్తూనే ఉన్నారు. జగన్ మీద కూడా షర్మిల ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. దీని వెనుక కారణాలు ఏమై ఉన్నప్పటికీ.. సొంత సోదరీమణులు రాజకీయ ప్రత్యర్థులుగా మారి విమర్శలు చేయడం ఒక రకంగా కేటీఆర్ కు.. జగన్మోహన్ రెడ్డికి ఇబ్బందే.ఫ్యూచర్లో అటు షర్మిల.. ఇటు కవిత తమ సోదరులకు ఇలాగే వైరి వర్గం లాగా ఉంటారా.. లేదా కలిసిపోతారా.. రక్తసంబంధం లో ఇటువంటి వివరాలు సర్వసాధారణమని చాటి చెబుతారా.. ఈ ప్రశ్నలకు అవును అని సమాధానం చెప్పారు ఓ సిద్ధాంతి. పెద్ద పెద్ద కుటుంబాలలో ఇటువంటి గొడవలు సాధారణమని.. అవి తాత్కాలికమైనవి మాత్రమేనని.. అవి దీర్ఘకాలం సాగే అవకాశం లేదని ఆయన కొట్టి పారేశారు. అంతేకాదు ఇటువంటి గొడవలు జరిగిన తర్వాత వ్యక్తుల మధ్య ప్రేమలు పెరిగిపోతాయని.. ఒక దశలో ద్వేషాన్ని.. కోపాన్ని పక్కన పెట్టి కలిసి పోతారని ఆయన గుర్తు చేశారు. ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడిన మాటలను ఆ సిద్ధాంతి ప్రస్తావించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఒకవేళ కేటీఆర్ కనుక విదేశాలలో కాకుండా ఇక్కడే ఉండి ఉంటే కచ్చితంగా కవిత రాఖీ కడతారని.. కానీ ఆయన విదేశాలకు వెళ్లడం వల్లే కవిత ఇబ్బంది పడుతున్నారని.. దీన్నిబట్టి ఈ గొడవలు శాశ్వతం కాదని.. తాత్కాలికం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన చెబుతున్నారు. ఒకవేళ ఆయన చెప్పినట్టుగా కవిత.. షర్మిల గనుక చేస్తే రెండు తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో ఒక సంచలనమైన పరిణామంగానే గుర్తుండిపోతుంది

# గూగుల్ డేటాకు అంతా రెడీ...

విశాఖపట్టణం, గూగుల్ భారత్‌లో తన స్మార్ట్‌ఫోన్, ఏఐ ప్రాజెక్టులను విస్తరిస్తోంది. మీడియా నివేదికల ప్రకారం, గూగుల్ భారత్‌లో తన ప్రధాన ఏఐ మౌలిక సదుపాయాల ప్రాజెక్టును వేగంగా విస్తరిస్తోంది. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 1 గిగావాట్ ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. దీని నిర్మాణ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా, ఈ ప్రాజెక్ట్ మొదటి దశలో ఉందని, రాబోయే 24 నుంచి 30 నెలల్లో ఇది పూర్తి అవుతుందని అంచనా వేస్తున్నారు.నివేదిక ప్రకారం, ఈ మొత్తం ప్రాజెక్టుకు ఏకకాలంలో బహుళ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని గూగుల్ అధికారి అలెగ్జాండర్ స్మిత్ పేర్కొన్నారు. ఈ సంస్థ ఏప్రిల్‌లో విశాఖపట్నంలో 1ఉచి ఏఐ డేటా సెంటర్ హబ్ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు మొదటి దశ 2028 నాటికి ప్రారంభం కావచ్చని ఇప్పుడు భావిస్తున్నారుఅ ంతేకాకుండా, ఈ మొత్తం ప్రాజెక్టును పూర్తిగా కార్యరూపం ఇవ్వడానికి ఐదు సంవత్సరాల వరకు పట్టవచ్చు. అంతేకాక, ఆ కంపెనీ 2025 నుంచి 2030 మధ్య దేశంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది.గూగుల్‌కు, భారత్‌లో తన ఏఐ సేవలను బలోపేతం చేయడంలో ఈ ఏఐ హబ్ కీలక పాత్ర పోషించగలదు. అంతేకాకుండా, తమ ఏఐ హబ్, సేవలకు భారత్ ఒక ఆశాజనకమైన మార్కెట్ అని ఆ సంస్థ విశ్వసిస్తోంది. ఇది భారత్‌లోని ప్రజలకు అనేక అవకాశాలను కల్పించగలదు.మీ సమాచారం కోసం, గూగుల్ తన ఏఐ డేటా సెంటర్‌ను విస్తరించడమే కాకుండా, తన ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను మరింత మెరుగుపరచడానికి విశాఖపట్నంలో ఒక కొత్త సి-కేబుల్‌పై కూడా




పనిచేస్తోంది. ఈ వేగవంతమైన ఇంటర్నెట్ నెట్‌వర్క్‌లు, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి ప్రధాన దేశాలకు కంపెనీ ఏఐ హబ్ నేరుగా కనెక్షన్‌లను ఏర్పాటు చేసుకోవడానికి వీలు కల్పిస్తాయనివేదికల ప్రకారం, విశాఖపట్నంలో నిర్మిస్తున్న ఏఐ డేటా సెంటర్ హబ్ పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో పనిచేయనుంది. ఈ 1 గిగావాట్ డేటా సెంటర్ ఎయిర్-కూల్డ్ టెక్నాలజీపై ఆధారపడి ఉంటుంది. అంతేకాకుండా, సాధారణంగా డేటా సెంటర్లు చాలా నీటిని వినియోగిస్తాయి, కానీ గూగుల్ ఈ సెంటర్‌లో నీటిని నియంత్రిత పద్ధతిలో ఉపయోగించాలని యోచిస్తోంది. దేశ పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని కంపెనీ తన డేటా సెంటర్‌ను ప్రారంభించాలని యోచిస్తోందని ఇది స్పష్టంగా సూచిస్తుంది.

# హైదరాబాద్‌కు వరద ముప్పు...

హైదరాబాద్ : హైదరాబాద్ నగరం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదో అంతే వేగంగా సమస్యలు కూడా చుట్టుముడుతున్నాయి. గడిచిన 24 ఏళ్లలో నగరంలో నిర్మిత ప్రాంతం, కాంక్రీట్ ఉపరితలాలు గణనీయంగా పెరగడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం తగ్గిపోయింది. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరదనీరు వేగంగా రోడ్లు, లోతట్టు ప్రాంతాలకు చేరుతోంది. వాతావరణంలో కూడా పెనుమార్పులు సంభవిస్తున్నాయి. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదై ఒక్కసారిగా ముంపు సమస్య ఏర్పడుతోంది. హైదరాబాద్‌లోని పట్టణీకరణ, పర్యావరణ మార్పులపై అంతర్జాతీయ ప్రతిష్టాత్మక జర్నల్ అయిన 'ఎన్విరాన్ మెంట్, డెవలప్ మెంట్, అండ్ సస్టెయినబిలిటీ'(ప్రపంచవ్యాప్తంగా ప్రముఖమైన శాస్త్రీయ, విద్యా, పరిశోధనా ప్రచురణ సంస్థ=స్ప్రింగర్ నేచర్) అధ్యయనం ప్రకారం, హైదరాబాద్ నగరం 60శాతం కాంక్రీట్ జంగిల్ గా మారిపోయింది. దీంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం తగ్గి, ఉపరితలంపై వేగంగా ప్రవహిస్తూ ముంపు తీవ్రతను పెంచుతోంది. నగరంలో వరద ప్రభావిత ప్రాంతం కూడా గత 24 ఏళ్లలో దాదాపు రెట్టింపైనట్లు అధ్యయనం గుర్తించింది. 2000లో సుమారు 100 చదరపు కిలోమీటర్లుగా ఉన్న ముంపు ప్రాంతం.. 2024 నాటికి 196 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. ఇదే సమయంలో నగర నిర్మిత ప్రాంతం 380 చదరపు కిలోమీటర్ల నుంచి 550 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. భారీ నిర్మాణాలతోపాటు సహజ వాగులు, చెరువులు, నాలాలు కుంచించుకుపోవడం నగర సహజ నీటి ప్రవాహ వ్యవస్థను దెబ్బతీస్తోందని అధ్యయనం పేర్కొంది. ముఖ్యంగా నగర తూర్పు ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారుతున్నట్లు అధ్యయనం వెల్లడించింది. తూర్పు జోన్‌లోని నాలాలు, డ్రైనేజీ వ్యవస్థల సామర్థ్యం తగ్గిపోవడం, నిర్మాణాలు విస్తరించడం వల్ల భారీ వర్షాల సమయంలో నీరు నిలిచిపోయే పరిస్థితి పెరుగుతోందని తెలిపింది. మలక్‌పేట, సైదాబాద్, ఫలక్‌నుమా, చైతన్యపురి, కాచిగూడ తదితర ప్రాంతాల్లో వరద ముప్పు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. తూర్పు ప్రాంతాల్లో మురుగు, వర్షపు నీటి ప్రవాహానికి కీలకమైన నాలాలు కుంచించుకుపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోందని తెలిపారు. పశ్చిమ ప్రాంతం సైతం ప్రమాదకర స్థాయిలో విస్తరిస్తున్నట్టు అంచనా వేశారు. భారీ టవర్లు, తక్కువ విస్తీర్ణంలో అత్యధిక జనాభా ఉండేలా ఎత్తైన అపార్ట్మెంట్ల నిర్మాణం వల్ల భవిష్యత్తులో సవాళ్లు ఎదురవుతాయని పేర్కొన్నారు.

### డ్రైనేజీ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి

హైదరాబాద్‌లో సుమారు 860 కిలోమీటర్ల ఓపెన్ డ్రెయిన్లు, 660 కిలోమీటర్ల కవర్డ్ డ్రెయిన్లు, 316 కిలోమీటర్ల నాలాలు ఉన్నప్పటికీ.. భారీ వర్షాల సమయంలో వాటి సామర్థ్యం సరిపోవడం లేదని అధ్యయనం తెలిపింది. నగరంలో దాదాపు 80 శాతం ప్రాంతానికి ప్రత్యేకమైన వరదనీటి పారుదల వ్యవస్థ లేకపోవడం ప్రధాన సమస్యగా పేర్కొంది. గంటకు 12 మిల్లీమీటర్లకు మించి వర్షపాతం నమోదైతే అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి



ఏర్పడుతున్నట్లు అధ్యయనం వెల్లడించింది. మురుగునీటి పారుదల, వరదనీటి పారుదల వ్యవస్థలను కలిపి నిర్వహించడం వల్ల డ్రెయిన్లు తరచూ జామ్ కావడం, వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడటం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా తక్కువ వ్యవధిలోనే అత్యధిక వర్షపాతం నమోదవుతోంది. దీంతో నీరు బయటకు వెళ్లేందుకు తగిన మార్గాలు లేక నగరంలోని అనేక ప్రాంతాలు ఒక్కసారిగా ముంపునకు గురవుతున్నాయి.

### చెరువులు, నాలాల పరిరక్షణే కీలకం

హైదరాబాద్ వరద ముప్పును తగ్గించాలంటే చెరువులు, నాలాలు, సహజ నీటి ప్రవాహ మార్గాలను పరిరక్షించడంతోపాటు డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. నగరానికి సహజ వరదనీటి పారుదల వ్యవస్థగా ఉన్న మూసీ నదికి వర్షపు నీరు సజావుగా చేరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.కబ్జాలు, అక్రమ నిర్మాణాల కారణంగా వర్షపు నీరు మూసీలోకి చేరే మార్గాలు మూసుకుపోవడం కూడా ముంపునకు కారణమవుతోందని చెబుతున్నారు. ప్రకృతి ఆధారిత పరిష్కారాలను విస్తృతంగా అమలు చేయాలని సూచిస్తున్నారు. బయోరిటెన్షన్ ప్రాంతాలు, ఇంకుడు గుంతలు, రెయిన్ గార్డెన్లు, నీరు భూమిలోకి ఇంకేలా చేసే పేవ్‌మెంట్లను ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటి ప్రవాహాన్ని నియంత్రించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

### లోటు వర్షపాతమైనా.. ముంపు ముప్పే

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు హైదరాబాద్‌లో 30 వర్షపు రోజులు నమోదయ్యాయి. సాధారణంగా ఈ కాలంలో నమోదయ్యే వర్షపాతంతో పోలిస్తే 18 శాతం లోటు ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది. అయితే వర్షపాతం లోటులో ఉన్నప్పటికీ.. ఒక్కసారిగా కురిసే భారీ వర్షాలు నగరాన్ని ముంచెత్తే ప్రమాదాన్ని పెంచుతున్నాయి. కాంక్రీట్ విస్తరణ, తగ్గుతున్న చెరువులు, కుంచించుకుపోతున్న నాలాలు, పరిమిత డ్రైనేజీ సామర్థ్యం, మారుతున్న వాతావరణ పరిస్థితులు కలిసి హైదరాబాద్ వరద ముప్పును మరింత పెంచుతున్నాయని అధ్యయనం స్పష్టం చేస్తోంది.

# వైసీపీలో 'సజ్జల-బొత్స' కల్లోలం!

గుంటూరు,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై బాంబు వేశారు విజయసాయిరెడ్డి. తనను నమ్మకద్రోహి అంటూ విమర్శించడానికి తట్టుకోలేక 2 పేజీల బహిరంగ లేఖను విడుదల చేశారు. ప్రధానంగా సజ్జల రామకృష్ణారెడ్డిని టార్గెట్ చేసుకున్నారు. ఆయనకంటే ఇంకా నమ్మకద్రోహి ఎవరు ఉంటారు అంటూ.. పార్టీలో తనకు జరిగిన అన్యాయాన్ని, అవమానాలను ఏకరువు పెడుతూ తన ఆవేదనను బయటపెట్టారు. అయితే మధ్యలో ఉత్తరాంధ్రకు చెందిన మాజీ మంత్రి అంటూ పరోక్షంగా బొత్స సత్యనారాయణ ప్రస్తావన తీసుకొచ్చారు. త్వరలో పార్టీ మారబోతున్న ఓ మాజీ మంత్రి అంటూ అభివర్ణించారు. బొత్సతో కలిసి సజ్జల రామకృష్ణారెడ్డి తనపై కుట్ర చేసి.. ఉత్తరాంధ్ర సమన్వయకర్త పదవి నుంచి తొలగించారని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడు రెండు విషయాల్లో క్లారిటీ ఇచ్చారు విజయసాయిరెడ్డి. సజ్జల రామకృష్ణారెడ్డి టిడిపి కోవర్టుగా పనిచేస్తున్నారని ఒకవైపు.. బొత్స సత్యనారాయణ పార్టీ మారబోతున్నారు అని క్లారిటీ ఇచ్చారు. ఈ రెండు అంశాలు ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన నింపుతున్నాయి.విజయసాయిరెడ్డి లాజిక్ తో కొట్టారు. నమ్మకద్రోహి అయి ఉంటే నాడు కాంగ్రెస్ పార్టీతో రాజీ పడే వాడినని.. జగన్మోహన్ రెడ్డితో కేసులు పడేవాడిని కాదు అంటూ.. పార్టీ ఏర్పాటుకు ముందు నుంచే తాను జగన్మోహన్ రెడ్డికి నమ్మిన బంటు అని చెప్పే ప్రయత్నం చేశారు. మరోవైపు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సజ్జల రామకృష్ణారెడ్డి పై ఒక్క ఛార్జ్ షీట్ దాఖలు కాని విషయాన్ని ప్రస్తావించి.. టిడిపి తో కుమ్మక్కు అయ్యారని చెప్పేందుకు ఇంతకంటే మంచి ఉదాహరణ ఏముంటుందని చెప్పే ప్రయత్నం చేశారు. దానిపై కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆలోచన మొదలైంది. సజ్జల రామకృష్ణారెడ్డి తీరు వల్ల పార్టీకి డ్యామేజ్ జరుగుతుందనే క్యాడర్ అభిప్రాయానికి మరింత బలం చేకూరింది.మరోవైపు బొత్స సత్యనారాయణ పార్టీ మారే అవకాశం ఉన్నట్లు ఇటీవల ప్రచారం నడిచింది. కుటుంబ అవసరాల రీత్యా ఆయన జనసేనలో చేరుతారన్న టాక్ కూడా ఉంది. కానీ ఇంతవరకు ఆ ప్రచారాన్ని ఖండించలేదు బొత్స. ఇప్పుడు విజయసాయిరెడ్డి ఆ ప్రస్తావన తీసుకొచ్చేసరికి ప్రాథమికంగా ఏదో జరిగిందన్న అనుమానం ఉంది. అయితే బొత్స కు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రాధాన్యత దృష్ట్యా ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారని మెజారిటీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. ఉత్త ప్రచారం అని తేల్చేసాయి. కానీ ఇప్పుడు విజయసాయిరెడ్డి బొత్స విషయంలో బాంబు పేల్చారు. ఆయన పార్టీ మారబోతున్నట్లు ప్రస్తావన తీసుకొచ్చారు. ఒకవైపు సజ్జల టిడిపి కోవర్టుగా పనిచేస్తున్నారని ఒకవైపు.. బొత్స పార్టీ మారబోతున్నారన్న విషయం ఒక వైపు.. వైసీపీలో కల్లోలం రేపుతోంది.

### సజ్జల నన్ను కొట్టాడు

సోనియా గాంధీని ఎదిరించి పార్టీ పెట్టిన తర్వాత.. వైయస్ జగన్మోహన్ రెడ్డికి అన్ని తనై నడిపించారు విజయసాయిరెడ్డి. జగన్ కంపెనీలలోకి ప్రవహించిన



పెట్టుబడులు.. ఆయన స్థాపించిన సంస్థలు.. సంపాదించిన ఆస్తులు.. వీటన్నిటిని పర్యవేక్షించారు విజయసాయిరెడ్డి. అప్పట్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసులు పెట్టినప్పుడు.. కేంద్ర దర్యాప్తు సంస్థలకు దొరకకుండా జగన్ స్థాపించిన కంపెనీల వ్యవహారాలను.. లోగోట్టును బయటపడకుండా చూశారు విజయసాయిరెడ్డి.2019 ఎన్నికల్లో జగన్ గెలవడంలో షర్మిల ఎంతైతే పాత్ర పోషించారు.. అంతకుమించిన స్థాయి పాత్రను విజయసాయిరెడ్డి పోషించారు. నాడు రాజ్యసభ సభ్యుడిగా విజయ సాయి రెడ్డి ఉండేవారు. ఎప్పుడైతే సజ్జల రామకృష్ణారెడ్డి జగన్ కోటరీలో చేరిపోయారో అప్పుడే పరిస్థితి మారిపోయింది. విజయసాయి రెడ్డి ప్రభ మసకబారడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే విజయసాయిరెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి చేతిలో భౌతిక దాడికి గురయ్యారు. ఆ సమయంలో జగన్ పక్కనే ఉన్నప్పటికీ కనీసం మాట కూడా మాట్లాడలేదు. దీనికి తోడు అన్ని బాధ్యతల నుంచి విజయసాయిరెడ్డిని తప్పించారు. దీంతో తట్టుకోలేక విజయసాయిరెడ్డి బయటికి వచ్చేసారు. పార్టీ ద్వారా సంక్రమించిన రాజ్యసభ సభ్యత్వాన్ని కూడా వదులుకున్నారు.పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత విజయసాయిరెడ్డి అసలు విషయాలను బయటపెడుతున్నారు.. మద్యం కుంభకోణం.. ఇతర అక్రమాలను ఆయన మీడియా ముందు ఉంచుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా విజయసాయిరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. నాడు పార్టీలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను.. అవమానాలను ఆయన బయటపెట్టారు. 2022లో వైసీపీ ప్లీనరీలో అందరి ముందు విజయసాయి రెడ్డి పై సజ్జల రామకృష్ణారెడ్డి భౌతిక దాడి చేశారు. నాడు జగన్ ప్రత్యేక పాత్రకే పరిమితమయ్యారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. అన్ని బాధ్యతల నుంచి విజయసాయిరెడ్డిని జగన్ తప్పించారు. అంతేకాదు నాటి సజ్జల కేవలం ఎమ్మెల్యేలు ఎంపీలకు మాత్రమే కాకుండా మంత్రులకు కూడా జగన్ అపాయింట్మెంట్ లభించకుండా చేశారట. అందువల్లే వైసీపీ ఓడిపోయిందట. ఇప్పుడు టిడిపి కూటమితో సజ్జల రాజీ పడ్డారట. అందువల్లే నమోదైన కేసులలో ఆయన పేరు మీద చార్జిషీట్ ఏర్పాటు చేయలేదట. అంతేకాదు సజ్జల వల్ల జగన్ తన కుటుంబానికి దూరమయ్యారట.

# 100 ఎకరాల్లో ఇంటర్నేషనల్ స్టేడియం



హైదరాబాద్, హైదరాబాద్ క్రీడా రంగంలో మరో భారీ ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ స్టేడియంలో 1.32 లక్షలకుపైగా ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉండేలా ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా ఉన్న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంతో పోటీ పడనుంది.ఈ భారీ స్టేడియాన్ని రంగారెడ్డి జిల్లాలోని ముచ్చెర్ల సమీపంలోని భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్తులో హైదరా బాద్‌కు కీలక పట్టణ విస్తరణ కేంద్రంగా మారనున్న ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలనే ప్రణాళికల్లో భాగంగా ఈ స్టేడియాన్ని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ప్రధాన రహదారి మార్గాలతో అనుసంధానం ఉండేలా ప్రాజెక్టను రూపొందించనున్నారు. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సులభంగా చేరుకునే విధంగా కనెక్టివిటీని అభివృద్ధి చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. స్టేడియం నిర్మాణానికి సంబంధించిన పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఏడాది డిసెంబర్‌లో శంకుస్థాపన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే తుది తేదీ, నిర్మాణ సంస్థ, పూర్తి ప్రాజెక్ట్ షెడ్యూల్ వంటి అంశాలపై అధికారిక ప్రక టన రావాల్సి ఉంది.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం తెలంగాణ ప్రభుత్వం భూమిని సమకూర్చనుండగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి నిర్మాణం, నిర్వహణకు నిధులు సమకూర్చే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం.ఈ మోడల్‌పై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. క్రికెట్ స్టేడియంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో మరిన్ని క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. భారీ అంతర్జాతీయ మ్యాచ్‌లు, క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించగల సామర్థ్యంతో స్టేడియం ఏర్పడితే హైదరాబాద్‌కు క్రీడా పర్యాటకం, అంతర్జాతీయ ఈవెంట్ల పరంగా మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉంది.

# బీజేపీవైపు 'కొండా' అడుగులు ?!



హైదరాబాద్,'కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరతానని చెబితే దానిపై నేను స్పందిస్తాను. ఆమెను పార్టీలోకి తీసుకోవాలా ? వద్దా ? అన్నది నా వ్యక్తిగత నిర్ణయం కాదు. పార్టీ నాయకత్వం సమిష్టిగా తీసుకునే నిర్ణయం' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 'కొండా సురేఖ మీద ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. ఈ నేపథ్యంలో ఆమె పార్టీలో చేరతానంటే మేమెవరమూ వ్యతిరేకించం' అని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కొండు సురేఖ బీజేపీలోకి వెళ్లే అవకాశం ఉందా ? లేదా ? అన్న చర్చలు ఊపందుకున్నాయి.మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మిత సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో మొదలయిన వివాదం ఎటువైపు దారితీస్తుంది అన్న విషయం ఇంకా తేలలేదు. కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విదేశీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో సెప్టెంబరు 1న ఆయన వచ్చాక నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. ప్రస్తుతం బంతి అధిష్టానం కోర్టులో ఉంది.తాము కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని, గాంధీ కుటుంబం మీద తమకు పూర్తి విశ్వాసం ఉందని కొండా సురేఖ భర్త కొండా మురళి చెబుతుండగా, తన టార్గెట్ రేవంత్ రెడ్డి అని, కాంగ్రెస్ పార్టీ కాదు అని కొండా సుష్మిత అంటున్నారు. ఈ పరిస్థితి ఇలా ఉంటే రాఖీ పౌర్ణమి సందర్భంగా రేవంత్ రెడ్డిని కలిసిన కొండా సురేఖ ఆయనకు బంగారు రాఖీని కట్టింది. అతని మనవడికి కూడా రాఖీ కట్టడం గమనార్హం.కాంగ్రెస్ అధిష్టానం ఖచ్చితంగా కొండా సురేఖను రాజీనామా చేయాలని కోరుతుందని ప్రచారం జరుగుతున్నది. క్యాబినెట్ పునర్ వ్యవస్థీకరణ పేరుతో ఆమెతో రాజీనామా చేయిస్తారని అంటున్నారు. తన మీద చర్యలు తీసుకోకుంటే పార్టీలో మరికొందరు కూడా ఇలాగే వ్యవహరించే అవకాశం ఉందని, అందుకే సెప్టెంబరులో శాసనసభ సమావేశాలకు ముందే మంత్రి వర్గ విస్తరణ లేదా కొండా సురేఖ రాజీనామా అంశంలో అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి వత్తిడి పెంచుతున్నట్లు చెబుతున్నారు. ఒకవేళ కొండా సురేఖ రాజీనామా చేస్తే బీజేపీ వైపు వెళ్లే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మరోవైపు ఆమె కూతురు సుష్మిత జనసేన వైపు చూస్తున్నారన్న ప్రచారం కూడా జరుగుతుంది.అయితే కొండా కుటుంబం బీజేపీలోకి వెళ్తే పరకాల, వరంగల్ తూర్పులో ప్రభావం చూపుతారని అంటున్నారు. కాగా గత ఎన్నికల్లో వరంగల్ తూర్పులో బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు మీద కొండా సురేఖ 15,652 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. ఇక్కడ కొండా సురేఖకు 67,757 ఓట్లు రాగా, ప్రదీప్ రావు 52,105 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలబడ్డాడు. దీంతో ఆమె బీజేపీలోకి వస్తే ప్రదీప్ రావు పరిస్థితి ఏంటి అన్న చర్చ కూడా మొదలయింది.ఇక పరకాలలో గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన కాళీ ప్రసాద్ రావు 38,735 ఓట్లు సాధించారు. పోలైన ఓట్లలో సుమారు 20.5 శాతం ఓట్లు దక్కించుకున్నారు. అయితే కొండా సురేఖ వస్తే అక్కడ బీజేపీ మరింత పుంజుకుంటుంది అన్న చర్చ ఒకవైపు ఉండగా, ఆమె పార్టీలోకి వచ్చి పరకాల, వరంగల్ తూర్పు స్థానాలలో తాను, తన కూతురు పోటీ చేస్తే తమ పరిస్థితి ఏంటి అని ఇప్పటి వరకు అక్కడ ఉన్న నాయకులు ఆలోచనలో పడ్డారు. మరి కొండా సురేఖ ఎంట్రీ ఖాయమేనా అంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140